RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :200 EDITOR: CHERUKU UPENDAR, DATE : TUESDAY 05 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 200 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 05 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## తెలంగాణకూ రెండ్రోజులు భారీ వర్షసూచన

**బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఏపీ, తమిళనాడు రాష్ట్రాలపై విపరీత ప్రభావం చూపుతున్న మిగ్జామ్ తుఫాన్ తెలంగాణపైనా ఎఫెక్ట్ చూపనున్నది. రాష్ట్రంలో వచ్చే రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతా వరణ కేంద్రం ప్రధాన

మిగతా 2లో



## పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం

- లోక్‌సభలో న్యాయవాదుల బిల్లు
- రాజ్యసభలో పోస్టాఫీసు బిల్లు ఆమోదం
- ప్రవేశపెట్టిన తెలంగాణ గిరిజన యూనివర్సిటీ బిల్లు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజ్యసభలో పోస్టా ఫీసు బిల్లు, లోక్‌సభలో న్యాయవాదులు సవరణ బిల్లు ఆమోదం పొందాయి. రాజ్యసభలో పోస్టాఫీసు సవరణ బిల్లును కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రవేశపెట్టారు. దేశం లోని తపాలా కార్యాలయానికి సంబంధించిన చట్టాన్ని ఏకీకృతం చేయడం, సవరించడం, దానితో అనుసం ధానించడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పోస్టాఫీసుల ప్రయివేటీకరణ అంశాన్ని ప్రభుత్వం

మిగతా 2లో

# రేవంత్‌కే.. పట్టం..!

- ఎల్లుండి ఉదయం టీ-సీఎంగా ప్రమాణ స్వీకారం
- అదేరోజు పూర్తి స్థాయి మంత్రివర్గమూ ప్రమాణం
- నేడు, రేపు మంచిరోజులు కాకపోవడంతో ఈ నిర్ణయం
- ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయం తీసుకున్న పరిశీలకులు
- రేవంత్‌రెడ్డికి మద్దతు తెలిపిన మెజారిటీ ఎమ్మెల్యేలు!
- నిర్ణయాధికారాన్ని ఖర్గేకు అప్పగిస్తూ ఏకగ్రీవ తీర్మానం
- ఢిల్లీకి ఏఐసీసీ పరిశీలకుల పయనం.. నేడు ప్రకటన



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రిగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. మంగళ, బుధవారాలు మంచిరోజులు కాకపోవడంతో 7న ఆయన ప్రమాణ స్వీకారం పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అదేరోజు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. ప్రజాకర్షణ, టీపీసీసీ అధ్యక్షుడిగా పనితీరు ఆధారంగానే ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సీఎల్పీ నేత, ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియలో

మిగతా 2లో

## మూడవ శాసనసభకు గవర్నర్ ఆమోదం

**119 మంది కొత్త ఎమ్మెల్యేల జాబితా ఇచ్చిన సీఈఓ వికాస్‌రాజ్**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్ ఆమోదించారు. దానితోపాటే తెలంగాణ రాష్ట్ర రెండో శాసనసభను రద్దు చేస్తూ, మూడో శాసనసభను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ గెజిట్‌ను విడుదల చేశారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్‌రాజ్, కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాష్ కుమార్ గవర్నర్

మిగతా 2లో



## మళ్లీ చెలరేగిన హింస..

**- మణిపూర్‌లో తెగల మధ్య ఘర్షణ..**

**- 13 మంది మృతి**



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు : మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. టెంగ్‌నౌపాల్ జిల్లా సైబాల్ సమీపంలోని లీతూ గ్రామంలో రెండు తెగల వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరినొకరు కర్రలు, రాళ్లతో కొట్టుకున్నారు. తుపాకులతో కాల్చుకున్నారు. ఈ ఘర్షణల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘర్షణలు జరుగుతున్నట్టు సమాచారం అందుకున్న భద్రతాధికారులు వెంటనే అక్కడకు చేరుకున్నాయి. కాగా అప్పటికే

మిగతా 3లో

## రాష్ట్ర ప్రగతి కోసం

# కొత్త సర్కారుకు అండగా నిలుద్దాం

- జనవరి 16 దాకా మన సర్కారు కొనసాగే
- అవకాశమున్నా హుందాగా తప్పుకొన్నాం
- త్వరలో బీఆర్ఎస్‌ఎల్పీ నేతను ఎన్నుకుందాం
- తనను కలిసిన పార్టీ నేతలతో కేసీఆర్


హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవిద్దామని బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీ నేతలతో చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సాధారణమన్నారు. తాజా ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు, ఓడినవారు, పలువురు ముఖ్య నేతలతో సోమవారం ఎర్రవెల్లిలోని తన ఫాంహౌసలో కేసీఆర్ సమావేశం అయ్యారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిని ఈ సందర్భంగా కేసీఆర్ అభినందించారు. ఆయా నియోజకవర్గాల్లో ఓటమికి కారణాలు, ఎన్నికల తర్వాత ప్రజల్లో పెరుగుతున్న సానుభూతి, ఇతర అంశాలపై పార్టీ నేతలతో ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం పార్టీ నేతలతో కేసీఆర్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా జనవరి 16 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ ప్రజల తీర్పుతో హుందాగా తప్పుకొన్నామని అభిప్రాయపడినట్లు సమాచారం. రాష్ట్ర ప్రగతి దృష్ట్యా కొత్త ప్రభుత్వానికి సహకరిద్దామని, అసలు ఏం జరుగుతుందో వేచి చూద్దామని వారికి సూచించినట్లు తెలిసింది. త్వరలోనే తెలంగాణ భవన్‌లో పార్టీ సమావేశం నిర్వహించుకుందామని, ఎన్నికల ఫలితాలపై సమీక్షించుకుని, లోటుపాట్లను సవరించుకుందామనీ చెప్పినట్లు సమాచారం. బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతను కూడా త్వరలోనే ఎన్నుకుందామని పార్టీ నాయకులతో అన్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన వారిలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్, పోచారం, జగదీశరెడ్డి, మహమూద్ అలీ, పట్నం మహేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, తుల ఉమ, మల్లారెడ్డి, కడియం శ్రీహరి, పద్మా దేవేందర్‌రెడ్డి, తలసాని, ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డి, సత్యవతి రాథోడ్,

మిగతా 2లో

## కుప్పకూలిన శిక్షణ విమానం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

మెదక్ జిల్లా తూప్రాన్ లో శిక్షణ విమానం కూలడంపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ స్పందించింది. మెదక్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. దుండిగల్ ఎయిర్‌పోర్టు శిక్షణ విమానం కుప్ప కూలింది. అయితే..ఈ విమాన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు.. పైలెట్, ట్రైనీ పైలెట్ సజీవదహనం అయ్యారని సమాచారం అందుతోంది. తూప్రాన్ రావెల్లి శివారులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇక గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహాలు ఉన్నట్లు చెబుతున్నారు అధికారులు. అయితే మెదక్ జిల్లా తూప్రాన్ లో శిక్షణ విమానం కూలడంపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ స్పందించింది. హైదరాబాదులో సాధారణ శిక్షణ కార్యక్రమంలో ఉదయం విమానం ప్రమాదానికి గురైంది. విమానంలోని ఇద్దరు పైలెట్లు చనిపోయినట్లు గుర్తించినట్లు ధృవీకరించింది. ఇతరుల ఆస్తి, ప్రాణాలకు నష్టం జరగలేదు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి కోర్ట్ ఆఫ్ ఎంక్వయిరీ ని ఆదేశించాం" అని ట్వీట్ లో పేర్కొంది.

# తెలంగాణకూ రెండ్రోజులు భారీ వర్షసూచన

(మొదటిపేజీ తరువాయి)

సంచాలకులు కె.నాగరత్న తెలిపారు. దక్షిణాంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరాలకు దగ్గర మిగ్జామ్ తుఫాన్ కేంద్రీకృతమై ఉందని చెప్పారు. 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో ముందుకు సాగుతున్నదని తెలిపారు. ఈ తుఫాన్ మరింత బలపడి ఐదోతేదీన ఉదయం నెల్లూరు-మచిలీపట్నం మధ్య బాపట్ల దగ్గర తీరం దాటే అవకాముందని పేర్కొన్నారు. దీని ప్రభావం వల్ల మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో ఎక్కువ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని పేర్కొన్నారు. 'మంగళవారం నాడు రాష్ట్రంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి, అత్యంత భారీ వర్షాలు, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలలో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, పెద్దపల్లి, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కి.మి. వేగంతో వీచే అవకాశం వుంది' అని తెలిపారు. బుధవారం నాడు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు.

# మూడవ శాసనసభకు గవర్నర్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

తమిళసైని కలిసి నూతనంగా ఎన్నికైన 119 ఎమ్మెల్యేల పేర్లతో కూడిన జాబితాను అందచేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి, ప్రజాస్వామ్య ప్రక్రియ ప్రతిష్ట పెంచారంటూ గవర్నర్ ఎన్నికల సంఘం అధికారుల్ని అభినందించారు. జాబితాకు గవర్నర్ ఆమోదం తెలపగానే, రాష్ట్ర రెండో శాసనసభ రద్దు అయినట్టు ప్రభుత్వ గెజిట్ విడుదల అయ్యింది. ఆ వెంటనే నూతన సభ్యులతో మూడో శాసనసభను ఏర్పాటు చేస్తున్నట్టు మరో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

### రాష్ట్ర ప్రగతి కోసం

# కొత్త సర్కారుకు అండగా నిలుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

రెడ్యానాయక్ తదితరులున్నారు.

తాను చివరి వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే ఉంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ మారే ప్రసక్తేలేదన్నారు. ఫాంహౌసలో సీఎం కేసీఆర్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒకే ఒక్కసారి పార్టీ మారానని ఆయన చెప్పారు. చివరి దాకా కేసీఆర్‌తోనే ఉంటానన్నారు. నియోజకవర్గ సమస్యలకు కొన్ని పరిష్కారాలు లభించాయని, పార్టీ మారే ఆలోచనే లేదని తెలిపారు. ఉదయం కేటీఆర్‌తో జరిగిన సమావేశానికి ఆహ్వానం లేనందున వెళ్లలేదన్నారు. ఆ చెత్త కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లబోమని, ప్రజలిచ్చినవిపక్ష పాత్రను సమర్థంగా నిర్వర్తిస్తామని తెలిపారు.

**కేసీఆర్‌కు గెలుపు ధ్రువీకరణ పత్రం**

అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గం నుంచి గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని వంటేరు ప్రతాపరెడ్డి సోమవారం ఫాంహౌసలో కేసీఆర్‌కు అందజేశారు.


# ఎస్సెస్సీ పరీక్షా ఫీజు గడువు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎస్సెస్సీ వార్షిక పరీక్షల ఫీజుల చెల్లింపునకు డిసెంబర్ 7 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు తమ ఫీజులను సంబంధిత హెడ్ మాస్టర్‌కు చెల్లించాల్సి ఉంటుంది. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 14 నాటికి, రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 12 నాటికి, రూ.500తో జనవరి 3 నాటికి ఫీజులను చెల్లించవచ్చు

# తెలంగాణలో ఎన్నికల కోడ్ ఎత్తివేత

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు




తెలంగాణలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఎత్తివేసింది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లోనూ ఎన్నికల కోడ్‌ను ఈసీ ఎత్తివేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్ 9న షెడ్యూల్ వెలువడిన సంగతి తెలిసిందే. నవంబర్ 3న ఎన్నికల ప్రకటన జారీ కాగా, 10వ తేదీ వరకు నామపత్రాలను స్వీకరించారు. 13న నామపత్రాల పరిశీలన, 15న ఉపసంహరణ తర్వాత 30న పోలింగ్ జరిగింది. డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు నిర్వహించారు. ఫలితాలు వెలువడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎత్తివేస్తున్నట్లు ఈసీ ప్రకటించింది. ఎత్తివేత తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టే ఉద్దేశం లేదని తేల్చి చెప్పారు. బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్ష ఎంపీలు పోస్టాఫీసుల ప్రయివేటీకరణ అంశంపై ఆందోళన వ్యక్తంచేశారు.

మరోవైపు న్యాయవాద వృత్తిని నియంత్రించేందుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లును లోక్‌సభలో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. న్యాయవాద వృత్తిని ఒకే చట్టం ద్వారా క్రమబద్ధీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. దేశంలోని న్యాయస్థానాల్లో దూషణల పాత్ర ఉండకూడదని చెప్పారు. బిల్లుపై చర్చ సందర్భంగా పలువురు ఎంపీలు సవరణల్లోని లోపాలను ఎత్తి చూపారు.

**లోక్‌సభలో తెలంగాణ గిరిజన యూనివర్సిటీ బిల్లు**

తెలంగాణలోని సమ్మక్క, సారక్క సెంట్రల్ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన సెంట్రల్ యూనివర్సిటీ సవరణ బిల్లును కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వరంగల్ జిల్లా ములుగులో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయనుంది. గిరిజన యూనివర్సిటీని రూ.889.07 కోట్లతో రెండు దశల్లో ఏడేండ్లలో నిర్మించనున్నట్టు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటు రాబోయే కాలంలో ప్రాంతీయ ఆకాంక్షలను తీర్చగలదని అన్నారు. అలాగే ఉన్నత విద్య నాణ్యతను పెంచుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఉన్నత విద్య, పరిశోధన సౌకర్యాలను సులభతరం చేస్తుందనీ, ప్రోత్సహిస్తుందన్నారు. దేశంలోని గిరిజన జనాభాకు గిరిజన కళలు, సంస్కృతి, ఆచారాలు, సాంకేతికతలో పురోగతిలో బోధన, పరిశోధన సౌకర్యాలను అందించడంతో అధునాతన జ్ఞానాన్ని కూడా ప్రోత్సహిస్తుందని అన్నారు.

**శాస్త్రవేత్త స్వామినాథన్‌కు భారతరత్న ఇవ్వాలి**

దివంగత ఎంఎస్ స్వామినాథన్ అంత్యక్రియలకు కేంద్రప్రభుత్వ ప్రతినిధి ఎవరూ హాజరు కాకపోవటం ఆయనను అగౌరవ పరచటమేనని కాంగ్రెస్ ఎంపీ కె సురేష్ వాపోయారు. ఆయనను భారతరత్నతో సత్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు లోక్‌సభలో జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. కొత్త పార్లమెంట్ భవనంలో స్వామినాథన్ జీవిత పరిమాణ విగ్రహాన్ని, సెంట్రల్ హాల్‌లో శాస్త్రవేత్త చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ఉత్తరాఖండ్ సొరంగం సంఘటనపై న్యాయ విచారణ జరపాలి : సీపీఐ(ఎం)**

ఉత్తరాఖండ్ సొరంగం సంఘటనపై న్యాయ విచారణ జరపాలని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ వి.శివదాసన్ డిమాండ్ చేశారు. రాజ్యసభలో జీరో అవర్‌లో సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్ ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా సొరంగం కూలిపోయిన అంశాన్ని లేవనెత్తారు. సంబంధిత సంస్థ భద్రతా చర్యలు అమలు చేయలేదని ఆరోపిస్తూ ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన చాలా బాధాకరమనీ, టన్నెలింగ్ కంపెనీ అన్ని భద్రతా చర్యలు, నియమాలు, నిబంధనలను ఉల్లంఘించిందని విమర్శించారు. పారదర్శక, న్యాయమైన విచారణ చాలా అవసరమని అన్నారు. సిల్క్యారా ఒక్కటే ఘటన కాదని, ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో ఇంతకు ముందు కూడా జరిగాయని తెలిపారు.

వాయు కాలుష్యం కారణంగా 21 లక్షల మంది మరణిస్తున్నారు. ఆప్‌కి చెందిన సంత్ బల్బీర్ సింగ్ వాయు కాలుష్య సమస్యను లేవనెత్తారు. వాయు కాలుష్యం కారణంగా ఏటా దాదాపు 21 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. ఏడాదిలో ఢిల్లీలో ఒక రోజు, ముంబయిలో ఐదు రోజులు, చెన్నైలో 15 రోజులు మాత్రమే గాలి శుభ్రంగా ఉందని సింగ్ పేర్కొన్నారు. వాయు కాలుష్యం గురించి చర్చలు వచ్చినప్పుడల్లా, పంజాబ్ రైతులు పొట్టను తగులబెట్టడమే దీనికి కారణమని అంటున్నారని ఆయన అన్నారు. పంజాబ్‌లోని ఏ రైతు కూడా పంట వ్యర్థాలను కాల్చడం ఇష్టం లేదని, తాజాగా విత్తే ముందు పొలాన్ని శుభ్రం చేయడానికి తమ పంటను కాల్చాల్సిన అవసరం లేదని రైతులకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్రాన్ని కోరారు.

# రేవంత్‌కే పట్టం..!

(మొదటిపేజీ తరువాయి)



భాగంగా కొత్తగా ఎన్నికైన 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సోమవారం ఓ హోటల్‌లో ఏఐసీసీ పరిశీలకులు డీకే శివకుమార్, మురళీధరన్, దీపాదాస్ మున్షీ, అజేయ్‌కుమార్, జార్జ్ సమావేశమయ్యారు. తొలుత కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు, సహకరించిన అధిష్ఠానం పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది.

అనంతరం సీఎల్పీ నేతను నిర్ణయించే అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అప్పగిస్తూ తీర్మానాన్ని సీఎల్పీ సమావేశం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ తదితరులు ప్రతిపాదించగా.. సభ్యులు ఆమోదించారు. అనంతరం సీఎంగా ఎవరిని నిర్ణయించాలన్న అంశంపై ప్రతి ఎమ్మెల్యేతో ఏఐసీసీ పరిశీలకులు ముఖాముఖి సమావేశమై అభిప్రాయాలు తీసుకున్నారు. అందరి అభిప్రాయాలనూ నోట్ చేసుకున్నారు. ఈ అభిప్రాయ సేకకరణలో మెజారిటీ ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిని సీఎంగా కోరుకున్నట్లు తెలిసింది. కాగా, సోమవారం సాయంత్రం బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో డీకే శివకుమార్ తదితరులు ఢిల్లీకి పయనమయ్యారు. మంగళవారం వారు మల్లికార్జున ఖర్గేను కలిసి ఎమ్మెల్యేల అభిప్రాయాలను వివరించనున్నారు. అనంతరం అధిష్ఠానం సీఎంపై నిర్ణయాన్ని ప్రకటించనుంది.

**సీఎం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసినా..**

తొలుత సోమవారం సాయంత్రమే సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్న ప్రచారం జరిగింది. అందుకు తగినట్లుగా రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ, సమాచార, పౌర సంబంధాలు, పోలీసు శాఖలు తగిన ఏర్పాట్లు కూడా చేశాయి. రాజ్‌భవన్‌లో సీఎం ప్రమాణస్వీకారం ఉంటుందన్న సమాచారం మేరకు టెంట్లు, కుర్చీలు, స్టేజీ వేశాయి. కానీ, ఆ తర్వాత అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. సీఎల్పీ నేతను ఎన్నుకునేందుకు గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా సమావేశమైనా.. ఎన్నిక మాత్రం జరగలేదు. సీఎల్పీ నేతను ఎంపిక చేసే అధికారాన్ని కాంగ్రెస్ అధిష్ఠానానికి కట్టబెడుతూ సమావేశం ఏకవాక్య తీర్మానం చేయడంతో బంతి అధిష్ఠానం కోర్టులోకి వెళ్లింది. పర్యవసానంగా సోమవారం జరుగుతుందనుకున్న ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమం వాయిదా పడింది.

**ఊహాగానాలను నమ్మొద్దు: భట్టివిక్రమార్క**

సీఎల్పీ నాయకుడి ఎంపిక విషయంలో ప్రసార మాధ్యమాల్లో వస్తున్నవి ఊహాగానాలు మాత్రమేనని మాజీ సీఎల్పీ నేత భట్టివిక్రమార్క తెలిపారు. వాటిని ఎవరూ నమ్మవద్దని ఒక ప్రకటనలో సూచించారు. సీఎల్పీ నేతను కాంగ్రెస్ అధిష్ఠానమే ప్రకటిస్తుందని, ఈ మేరకు సోమవారం జరిగిన ఎమ్మెల్యేల సమావేశంలో ఎంపిక బాధ్యతను పార్టీ అధిష్ఠానానికి అప్పగిస్తూ ఏకవాక్య తీర్మానం చేసినట్లు తెలిపారు.

**కార్యకర్తల కోలాహలం**

**రాయదుర్గం:** సీఎల్పీ నేత ఎంపికకు సంబంధించి చర్చించేందుకు ఏఐసీసీ పరిశీలకులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించిన గచ్చిబౌలిలోని ఎల్లా హోటల్ వద్ద సోమవారం పార్టీ కార్యకర్తలతో కోలాహలం నెలకొంది. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న పలువురు సీనియర్లు తమ మద్దతుదారులను హైదరాబాద్‌కు పిలిపించుకోవడంతో వారంతా సోమవారం తెల్లవారుజాము నుంచే హోటల్‌కు చేరుకున్నారు. సీఎల్పీ సమావేశం నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పెద్దసంఖ్యలో పోలీసులను మోహరించారు. ట్రిపుల్ ఐటీ నుంచి ఇన్ఫోసిసకు వెళ్లే రహదారిపై హోటల్ ప్రధాన గేటువద్దే కార్యకర్తలు, నాయకులను అడ్డుకున్నారు. దీంతో హోటల్ మెయిన్‌గేటు వద్దే వారు ఉండిపోయి అక్కడే ఉన్న మీడియా ఎదుట తమ నాయకుడినే ముఖ్యమంత్రిని చేయాలని నినాదాలు చేశారు. సమావేశం ముగిసేదాకా కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు హోటల్ మెయిన్‌గేటు వద్ద రోజంతా పడిగాపులు కాయడంతో ఆ రోడ్డులో వాహనాల రద్దీ పెరిగిపోయింది. పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నపట్టికీ వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# మళ్లీ చెలరేగిన హింస..

(మొదటిపేజీ తరువాయి)



అక్కడ 13 మృతదేహాలు పడి వున్నాయని భద్రతాధికారులు తెలిపారు. అయితే, ఈ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లీతూ గ్రామానికి చెందిన వారు కాదని అధికారులు ప్రాథమిక విచారణలో తేలింది. వేరే ప్రాంతం నుంచి వచ్చిన ఈ గ్రూప్.. గ్రామంలోని మరో తెగకు చెందిన గ్రూప్‌తో ఘర్షణకు దిగిందని భద్రతాధికారులు చెప్తున్నారు. స్థానికులు కాకపోవడంతో మరణించిన 13 మంది ఎవరనేది ఇంకా గుర్తించలేదు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కాగా, ఈ ఏడాది మే 3న మణిపూర్‌లోని మైతీ, కూకీ తెగల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలు కొన్ని నెలలపాటు కొనసాగాయి. ఈ హింసాత్మక ఘటనల్లో మొత్తం 182 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 50 వేల మంది నివాసాలను కోల్పోయారు. ఈ ఘర్షణల కట్టడి కోసం ఆ రాష్ట్రంలో భారీగా బలగాలను మోహరించారు. ఇంటర్నెట్ సేవలపై కూడా నిషేధం విధించారు. ఇటీవలే పరిస్థితి అదుపులోకి రావడంతో ఆదివారమే ఇంటర్నెట్ సేవలను తిరిగి పునరుద్ధరించారు. ఇంతలోనే మళ్లీ తెగల నడుమ ఘర్షణలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది.

# ఓయూలో ఉద్రిక్తత

- వీసీ ఛాంబర్‌లోకి దూసుకెళ్లిన విద్యార్థులు
- క్యాంపస్‌లో ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించాలని డిమాండ్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో సోమవారం ఉద్రిక్తత ఏర్పడింది. ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు క్యాంపస్‌లో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ గేట్లను, బారికేడ్లను తొలగించారు. అనంతరం వీసీని కలవడానికి విద్యార్థులు వెళ్లగా సెక్యూరిటీ సిబ్బంది నిరాకరించారు. దాంతో సిబ్బందితో విద్యార్థులు వాగ్వాదానికి దిగి వీసీ ఛాంబర్‌లోకి దూసుకెళ్లారు. వీసీ తీసుకున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అయితే రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత యూనివర్సిటీలో సభలు, సమావేశాలు పెట్టుకునే వాతావరణాన్ని లేకుండా చేశారు. యూనివర్సిటీలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. పెంచిన అన్ని కోర్సుల ఫీజులను తగ్గించాలని, పీహెచ్‌డీ విషయంలో టైం పీరియడ్‌ను రద్దు చేయాలని, వర్సిటీలో బారికేడ్లను, ముళ్ల కంచెలను తొలగించాలని డిమాండ్ చేశారు. బిసెక్యూర్ ఏజెన్సీని రద్దుచేసి అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న స్థానికులైన తెలంగాణ కార్మికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.

విద్యార్థుల అవసరాల దృష్ట్యా ఆర్టీసీ బస్సులను యూనివర్సిటీలోకి అనుమతి ఇవ్వాలని, విద్యార్థినులకు హాస్టల్స్‌లో భద్రత కల్పించాలని కోరారు. యూనివర్సిటీ నిధులను విద్యార్థుల మౌలిక సదుపాయాల కోసం వినియోగించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. అనంతరం ఓయూ వీసీ ప్రొఫెసర్‌రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కోటా శ్రీనివాస్, బాల లక్ష్మి, గ్యార నరేష్, నెల్లి సత్య, ఇరిగి లెనిన్, పెంచాల సతీష్, వలిగొండ నరసింహ, సమీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.’’

## ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దాం

ఎమ్మెల్యేల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రజలు అందించిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు, పార్టీ సీనియర్ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కేటీఆర్ మాట్లాడారు. పదేండ్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అనేక అద్భుత కార్యక్రమాలు చేపట్టామనీ, అందుకే ప్రజలు ఇంకో పార్టీకి అవకాశం ఇచ్చారని తెలిపారు. తమ పార్టీకి గౌరవప్రద స్థానాలను కట్టబెట్టారన్నారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను విజయవంతంగా నిర్వహిద్దామన్నారు. ఎన్నికల తర్వాత ప్రజల నుంచి తమ పార్టీ నాయకత్వంపైన సానుకూల స్పందన వస్తున్నదని చెప్పారు. తమ పార్టీ అధికారం కోల్పోతుందని అనుకోలేదన్నారు. సమాజంలోని అన్ని వర్గాల నుంచి వందలాది మెసేజ్‌లు వస్తున్న విషయంపై చర్చించారు. త్వరలోనే పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకుపోతామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయం, ప్రగతిభవన్ కేంద్రంగా విధులు నిర్వహించిన మనమంతా, ఇకపైన పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ కేంద్రంగా ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ సందర్భంగా పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలకు కేటీఆర్ అభినందనలు తెలిపారు.

# కేటీఆర్ మీటింగ్‌కు ఆ నలుగురు డుమ్మా..!

**పార్టీ మారుతున్నారంటూ ప్రచారం**
**- ఖండించిన పలువురు ఎమ్మెల్యేలు**
**- కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భేటీ**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దీంతో వీరు పార్టీ మారుతున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జోరందుకుంది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యేలు దాన్ని ఖండించారు. కాగా వీరందరూ కేసీఆర్‌తో భేటీ కావడానికి ఫాంహౌస్‌కు వెళ్లినట్టు సమాచారం. రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మాత్రం కారు జోరే కొనసాగింది. జిల్లాలోని ఐదు నియోజవర్గాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయ కేతనం ఎగరేశారు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మేడ్చల్ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. మల్కాజిగిరి, ఉప్పల్ నుంచి కొత్త వారు అసెంబ్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఈ ఐదుగురు ఎమ్మెల్యేలు అంతర్మథనంలో పడ్డారు. మంత్రి పదవిపై గంపెడాశలు పెట్టుకున్న సీనియర్లకు సైతం నిరాశే మిగిలింది. మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టనున్న ఇద్దరు కొత్త వారు సైతం ప్రతిపక్షంలోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే సందర్భంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు, భవిష్యత్ ప్రణాళికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో తెలంగాణ భవన్‌లో సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశానికి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంతో వారు పార్టీ మారుతున్నట్టు సోషల్ మీడియాలో పుకార్లు షికారు చేశాయి. జిల్లాలో సైతం జోరుగా ప్రచారం జరిగింది. కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు పావులు కదుపుతున్నట్టు చర్చ నడిచింది. దీన్ని వారు తీవ్రంగా ఖండించారు. కాగా పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సీఎం కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఓటమికి గల కారణాలపై చర్చించినట్టు సమాచారం.

**ఆ వార్తలను ఖండిస్తున్నా : మల్లారెడ్డి**

పలు వార్తా పత్రికల్లో తనపై వస్తున్న వార్తలను ఖండిస్తున్నట్టు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చెప్పారు. తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలపై మల్లారెడ్డి స్పందించారు. తాను ఎప్పుడూ బీఆర్ఎస్, కేసీఆర్‌తోనే ఉంటానని తెలిపారు. తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలను బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, నాయకులు నమ్మొద్దని చెప్పారు.

**తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు : మర్రి రాజశేఖర్‌రెడ్డి**

తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశానికి ఆయన హాజరు కాకపోవడంతో పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. తాను ఎప్పుడూ బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్ తోనే ఉంటానని స్పష్టం చేశారు.

# గీతంలో వినూత్న ప్రాజెక్టుల ఎగ్జిబిషన్

## టీఈపీటెప్ కార్యక్రమంలో విద్యార్థులు

**పటాన్‌చెరు- ప్రభాతసూర్యుడు :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు చెందిన హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ బీటెక్ తొలి ఏడాది విద్యార్థులు వినూత్నమైన ప్రాజెక్టు లను ప్రదర్శించారు. సోమవారం నిర్వహించిన సాంకేతిక అన్వే షణ, ఉత్పత్తి ఇంజనీరింగ్ (టీఈపీటెప్) కార్యక్రమంలో బీటెక్ తొలి ఏడాది విద్యార్థుల్లోని సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడం, ప్రయోగాత్మక విధానాన్ని పెంపొందించడంపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), ప్రోగ్రామింగ్, సిమ్యులేషన్, మెకానిజమ్స్, మ్యాచింగ్ కలయికను ఉపయోగించడం ద్వారా బహుళ క్రమశిక్షణా ప్రాజెక్టు ఆధారిత సామర్థ్యాలను ఇది ప్రోత్సహిస్తుంది. దీనికి అదనంగా, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, సంస్థాగత నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేస్తుంది. విద్యార్థులు తమ అభ్యాసాలను ప్రదర్శించడానికి ఈ ప్రాజెక్టు ఎగ్జిబిషన్ ఒక వేదికగా ఉపయోగపడింది. ఈ సెమిస్టర్‌లో సుమారు 15 గ్రూపుల విద్యా ర్థులు పాల్గొని, సూక్ష్మంగా రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు. త్రిపుర విద్యుత్ నియంత్రణ సంస్థ (టీఈఆర్సీ) చైర్మెన్ డి.రాధాకృష్ణ ఈ కార్యక్రమంలో



పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, బీటెక్ తొలి ఏడాది ప్రోగ్రాం ఇన్‌చార్జి ప్రొఫెసర్ పి.త్రినాథరావు ఎగ్జిబిషన్‌ను పర్యవేక్షించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు ఎగ్జిబిషన్‌ను సందర్శించి, సృజనాత్మకతను ప్రదర్శించిన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఈ ప్రాజెక్టు ఎగ్జిబిషన్ అవకాశం కల్పించడమే కాకుండా ఆవిష్కరణ, ఆచరణాత్మక అభ్యాసాన్ని పెంపొందించడంలో గీతం నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.

# ట్రక్కును ఢీకొట్టిన రాధికపూర్ ఎక్స్‌ప్రెస్..

## ఇంజిన్‌లో చెలరేగిన మంటలు..!

**కోల్‌కతా - ప్రభాత సూర్యుడు ::** పశ్చిమ బెంగాల్‌లో రాధికపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రక్కును ఢకొట్టింది. దీంతో రైలు పట్టాలు తప్పింది. ధూలియన్‌గంగ, బల్లాల్‌పూర్ స్టేషన్ల మధ్య వేకువ జామున ఒంటిగంట తర్వాత గంటలకు ఈ ఘటన జరిగింది. రైలు పట్టాలు తప్పగా.. ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బోగీల నుంచి ఇంజిన్‌ను వేరు చేసి మంటలను ఆర్పివేశారు. ఘటనకు సంబంధించి ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. ఈస్టర్న్ రైల్వే పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కౌశిక్ మిత్రా మాట్లాడుతూ ప్రమాదం గురించి తెల్లవారు జామున 1.15 గంటలకు సమాచారం వచ్చింది.

ట్రక్కును ఢకొనడంతో రాధికపూర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందన్నారు. రైలు మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్థలానికి చేరుకొని చేరుకొని మంటలను ఆర్పివేశారన్నారు. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని.. రైలులోని ప్రయాణికులను తరలించేందుకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారన్నారు. ప్రమాదం తర్వాత ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. కదులుతున్న రైలు నుంచి.. ప్రయాణికుడ్ని తోసేసిన టీటీఈ కదులుతున్న రైలు నుంచి ఒక ప్రయాణికుడ్ని టీటీఈ బయటకు



తోసేశాడు. దీంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భాతర్ తికులియా గ్రామానికి చెందిన నవల్ ప్రసాద్, కోల్‌కతా వెళ్లేందుకు ఆదివారం ఉజియార్‌పూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. జనరల్ బోగిలో ప్రయాణం కోసం టిక్కెట్ తీసుకున్నాడు. అయితే రాక్సాల్-హౌరా మధ్య నడిచే మిథిలా ఎక్స్‌ప్రెస్‌లోని స్లీపర్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోకి అతడు ఎక్కాడు. కాగా, ట్రైన్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ) ఆ వ్యక్తిని టికెట్ అడిగాడు. నవల్ ప్రసాద్ వద్ద జనరల్ టికెట్ ఉండటంతో జరిమానా కట్టాలని లేదా స్లీపర్ బోగి నుంచి కిందకు దిగాలని చెప్పాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో ఆ రైలు స్టేషన్ నుంచి కదలడంతో నవల్ ప్రసాద్‌ను టీటీఈ బయటకు తోసేశాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న నవల్ ప్రసాద్ కుటుంబ సభ్యులు తొలుత అతడ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పాట్నా మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

# ప్రజా తీర్పును స్వాగతిస్తున్నాను

## మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** ఎన్నికలలో గెలుపు ఓటమిలు సహజమని ఎవరు అధైర్య పడొద్దని అన్నారు. పార్టీ గెలుపు కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు మంచి రెడ్డి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రజా తీర్పును స్వాగతిస్తున్నానని, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ కోసం పని చేయాలన్నారు. ఎల్లవేళలా ప్రజలందరికీ అండగా ఉంటానని తెలిపారు.

# ఇండోనేషియాలో అగ్నిపర్వతం విస్ఫోటనం.. 11 మంది మృత్యువాత



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** ఇండోనేషియాలోని సుమత్రా దీవిలో మౌంట్ మరాపి అగ్నిపర్వతం బద్దలైంది. ఈ ఘటనలో 11 మంది ట్రెక్కర్లు (పర్వతారోహకులు) మృతి చెందారు. మౌంట్ మరాపి వాల్కనో ఆదివారం నాడు నిప్పులు కక్కింది. సహాయక చర్యలు చేపట్టిన అధికారులకు 11 మంది పర్వతారోహకులు విగత జీవుల్లా కనిపించారు. మొత్తం 26 మందితో కూడిన పర్వతారోహకుల బృందంలో చాలా మంది గల్లంతయ్యారు. అయితే, అధికారులు ఈ బృందంలో ముగ్గురిని కాపాడగలిగారు. మౌంట్ మరాపి ఎలాంటి ముందస్తు సంకేతాలు లేకుండా బద్దలవడంతో ప్రాణనష్టం జరిగినట్టు భావిస్తున్నారు. కాగా, ఈ అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో ఆకాశంలోకి 3 కిలోమీటర్ల ఎత్తున బూడిద ఆవరించింది. అగ్నిపర్వత శకలాలు సమీప గ్రామాలపై పడ్డాయి. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' జోన్ లో ఉన్న ఇండోనేషియాలో అత్యధికంగా 130 క్రియాశీలక అగ్నిపర్వతాలు ఉన్నాయి. వీటిలో మౌంట్ మరాపి రెండో అత్యంత ప్రమాదకర అగ్నిపర్వతంగా భావిస్తారు. ఈ అగ్నిపర్వతం నుంచి 3 కిలోమీటర్ల దూరాన్ని నిషిద్ధ ప్రాంతంగా ప్రకటించారు.

# జనవరి 6, 7 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు

## ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు టీఎసపీఎస్సీ ఆదేశం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** గ్రూప్-2 పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎసపీఎస్సీ) ఆదేశించింది. ఈ మేరకు టీఎసపీఎస్సీ సెక్రటరీ అనిత రామచంద్రన్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సోమవారం లేఖ రాశారు. జనవరి 6, 7 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అందులో పేర్కొన్నారు. పలు కారణాలతో రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో టీఎసపీఎస్సీ పరీక్షలు పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో టీఎసపీఎస్సీని ప్రక్షాళన చేయాలనే డిమాండ్ కూడా తెరపైకివచ్చింది. ప్రస్తుత కమిషన్‌పై తమకు నమ్మకంలేదని, కొత్త కమిషన్ ఏర్పాటు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత నుంచి వచ్చిన డిమాండ్ల మేరకు తాము మళ్లీ అధికారంలోకి వస్తే టీఎసపీఎస్సీలో పలుమార్పులు చేస్తామని గత ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. మరోవైపు ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి నియామకాలు చేపడతామని పేర్కొంది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్లకు టీఎసపీఎస్సీ సెక్రటరీ లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సబితమ్మను అభినందించిన కేటీఆర్

**మహేశ్వరం - ప్రభాత సూర్యుడు:** ఎమ్మెల్యేగా ఐదోవసారి గెలుపొందిన సందర్భంగా సబితాఇంద్రారెడ్డికి మంత్రి కేటీఆర్ అభినందించారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సబితా ఇంద్రారెడ్డిని ఐదోసారి ఎమ్మెల్యేగా గెలు పొందడంపై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు పి. కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బీసీ గురుకులంలో ఫుడ్ పాయిజన్

## - బీసీ గురుకులంలో ఫుడ్ పాయిజన్
## -16 మంది విద్యార్థినులకు అస్వస్థత





**చేవెళ్ల- ప్రభాత సూర్యుడు :** మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఫుడ్ పాయిజన్ కావడంతో 16 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ బీసీ గురుకులంలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలానికి చెందిన బీసీ హాస్టల్‌ను కొడంగల్‌లో భవన సదుపాయం లేక చేవెళ్ల నియోజకవర్గం ఊరెళ్ళ గ్రామం సాగర్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ మొత్తం 40 మంది విద్యార్థినులు ఉన్నారు. కాగా, ఆదివారం రాత్రి విద్యార్థినులు అన్నం తిని పడుకున్నారు. అయితే అర్ధరాత్రి 3గంటల సమయంలో కడుపు నొప్పి రావడంతో వెంటనే సిబ్బందికి చెప్పారు. సోమవారం ఉదయం 16 మంది విద్యార్థినులను చేవెళ్ల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిం చారు. మరో పది విద్యార్థినులకు గురుకులంలోనే చికిత్స అందించారు. బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ దామోదర్‌రెడ్డి హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. విద్యార్థుల పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకునానరు. విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయిందని స్కూల్ సిబ్బంది వెంటనే స్పందించడం వల్ల వారి ఆరోగ్యానికి ఎలాంటి హాని లేదని తెలిపారు. ఒక్కరు మినహా అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

హాస్టల్‌లో ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని, తల్లిదండ్రులు తెచ్చిన ఆహారం నుంచే ఇన్‌ఫెక్షన్ అయిందని ప్రిన్సిపాల్ అనిత అన్నారు. రెండు కాలేజీలకు కలిపి 1200 మంది విద్యార్థులు ఉన్నారని, ఇక్కడ ఎప్పుడూ ఫుడ్ పాయిజన్ కాలేదని, మంచి ఆహారం అందిస్తున్నామని తెలిపారు. కాగా, ప్రిన్సిపాల్ ఫుడ్ పాయిజన్ జరిగిందని ఒప్పుకోకపోగా పేరెంట్స్ తెచ్చిన బిర్యానీ, నూడిల్స్ తినడంతో జరిగిందని వారిపై నెట్టడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. ఇంటర్ చదువుతున్న విద్యార్థి పేరెంట్ బయటి ఫుడ్ ఏదైనా తెస్తే 40 మంది విద్యార్థినులు అస్వస్థతకు ఎందుకు గురవుతారని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై హాస్టల్ వార్డెన్ సల్మా బేగంను వివరణ కోరగా.. ఈ ఘటనకు వాతావరణంలోని మార్పులే కారమణమని చెప్పారు. మీడియా ద్వారా విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఫుడ్ కంట్రోలర్ ఉదరు కిరణ్ హాస్టల్‌ను సందర్శించారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


# కొనుగోలు కేంద్రలను రైతులు సద్వినియోగించుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



**దోమ-ప్రభాత సూర్యుడు:** మండల కేంద్రంలోని డీసీఎంఎస్ ద్వారా వానా కాలం (ఖరీఫ్) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ..జిల్లాలో 122 వరి ధాన్యం కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల పం డించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లభించే విధంగా రైతులు తప్పనిసరిగా 17 శాతం తేమను పరిశీలించుకోవాలన్నారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు జారీ చేసిన టోకెన్ల ఆధారంగా రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గ్రేడ్-(ఎ) రకం ధా న్యానికి రూ.2,203/- గ్రేడ్ (బి)-రకానికి రూ. 2,183/- లభిస్తుందన్నారు. అన్ని కొనుగోలు కేంద్రా ల్లో అవసరమైన గన్ని బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తేమను పరిశీలించే యంత్రాలను సమ కూర్చామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసి ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తర లించేందుకు రవాణా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సీజన్‌లో జిల్లాలో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశ ముందన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల తీర్పుతోనే కాంగ్రెస్ పార్టీ గెలుపు



**టేకులపల్లి- ప్రభాత సూర్యుడు:** రాష్ట్ర ప్రజల తీర్పుతోనే రాష్ట్ర వ్యాప్తంగా 65 సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో పాటు ప్రభుత్వ ఏర్పాటు చేస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య దేవానాయక్ సోమవారం అన్నారు. టేకులపల్లి కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గంలోని ప్రజలు కోరం కనకయ్యను ఆదరించి, కని, విని ఎరుగని రీతిలో అత్యంత 57 వేల 129 మెజార్టీతో గెలిపించారన్నారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి గొప్పదన్నారు. అధిష్టానం మేరకు ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలలో దూసుకుపోయిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం మీద ప్రజలు విసిగిపోయి, కాంగ్రెస్ పార్టీని ఆదరించారన్నారు. ఆరు పథకాలు బడుగు బలహీన వర్గాలకు అతీతంగా ఉన్నాయని, ఆ పథకాలు ఆదర్శంగా తీసుకొని నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కృషివల్నే భారీ మెజార్టీ రావడం జరిగిందని, త్వరలోనే పథకాలు అందరికీ దరిచేరుతాయని అన్నారు. టేకులపల్లి సర్పంచ్ బోడ సరిత, ఉప సర్పంచ్ కట్టుకో జోల సురేష్, మాజీ సర్పంచ్ రెడ్యానాయక్, బానోత్ బద్రు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు భూక్య వెంకటేష్, నాయకులు ఇది గణేష్, మధు రెడ్డి, మూడు సంజరు, నర్సింగ్ లక్ష్మయ్య, రసమల్ల నర్సయ్య, నర్సింగ్ సుదీప్, బద్రు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215